క్లుప్తంగా

యువశ్రీకి పురస్కారం



పురుషోత్తంరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓలు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖలో అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్‌ దొమ్మరాజు యువశ్రీకి కళాజ్యోతి జాతీయ పురస్కారం వరించింది. భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎంవీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో చిత్తూరు నాగయ్య కళాక్షేత్రం వేదికగా ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి ద్విశతాధిక కళాకారుల మహోత్సవంలో ఆమె ఈ పురస్కారాన్ని సినీనటుడు డాక్టర్‌ రాజేంద్రప్రసాద్‌, ప్రముఖ సినీగేయ రచయిత డాక్టర్‌ సుద్దాల అశోక్‌, సర్వేపల్లి రాధాకృష్ణన్‌ మనుమడు డాక్టర్‌ సుబ్రమణ్యశర్మ చేతుల మీదుగా అందుకున్నారు. విద్యారంగంలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రికార్డ్‌ అసిస్టెంట్‌కు సత్కారం



పురుషోత్తంరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓలు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాకాల: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రికార్డ్‌ అసిస్టెంట్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన ఎం.పురుషోత్తంరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఆదివారం ఎంఈఓలు బాబ్జి, లింగయ్య ఆధ్వక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పురుషోత్తంరెడ్డి దంపతులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి.మహ్మద్‌రఫీ, విశ్రాంత డీవైఈఓ ఆనంద రెడ్డి, హెచ్‌ఎం దేవరాజులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడికి ఘన నివాళి



దొరస్వామిరెడ్డికి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, నాయకులు

పాకాల: భారతంమిట్టలో నివాసం ఉంటున్న వైఎస్‌ఆర్‌ సీపీ నేత, పాకాల పంచాయతీ ఉప సర్పంచ్‌ ప్రకాష్‌రెడ్డి తండ్రి కొనపరెడ్డి దొరస్వామిరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆదివారం ఆయన దశదిన కర్మక్రియలకు వైఎస్‌ఆర్‌ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌ రెడ్డి హాజరయ్యారు. ప్రకాష్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అన్ని సమయాల్లో పార్టీ అండగా ఉంటుందని ధైర్యం కల్పించారు. అనంతరం దొరస్వామి రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం



సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న మురళి

తిరుపతి కల్చరల్‌: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నం పెంచలయ్య అన్నారు. సీపీఐ శతవసంతాల సందర్భంగా ఎంఆర్‌పల్లెలోని 6వ శాఖ మహాసభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం వందేళ్ల సీపీఐ పోరాటాల చరిత్రను స్మరిస్తూ ఆంధ్రప్రదేశ్‌ ప్రజానాట్యమండలి కళాబృందం ప్రజా చైతన్య విప్లవ గేయాలతో ప్రజలను ఉత్తేజితుల్ని చేసింది. సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్‌, ఎన్‌డీ.రవి, కేటీ చలంరెడ్డి, ప్రజానాట్య మండలి నేత నాగరాజు, ఆర్‌.బలరాం, నాగభూషణం, పద్మనాభరెడ్డి, నీరుగట్టు నరేష్‌, శ్రీను, మునస్వామి, పుష్ప, పార్వతి పాల్గొన్నారు.

నీట్‌లో 'అశ్వమేధ' ప్రతిభ



నీట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులతో అశ్వమేధ డైరెక్టర్లు తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్‌ : నీట్‌ ఫలితాల్లో తిరుపతిలోని అశ్వమేధ జూనియర్‌ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఆ కళాశాల డైరెక్టర్లు అబ్దుల్‌ ఇష్రత్‌, గోవర్ధన్‌ తెలిపారు. ఈ ఫలితాల్లో అభినవ్‌రామ్‌ 591మార్కులు, అభిషేక్‌ 560, శ్రేయ 556, హెచ్‌.వీణ 537, ఏజె.సిద్రమన్‌ 536, హరీశ్వర్‌ 535, జి.మాధురి 522, ముఖేష్‌రెడ్డి 518, ఎన్‌జె.స్వప్న 509, డి.రోషన్‌ 507 మార్కులు సాధించారని తెలిపారు. వీరితో పాటు పలువురు విద్యార్థులు మంచి మార్కులు సాధించారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

ఢిల్లీ రైలు రోజూ తిరిగేదెన్నడో..?

- రాయలసీమ వాసుల ఆకాంక్ష ఫలించేనా?
- అసాధ్యాన్ని సుసాధ్యం చేయాలి
- ప్రజాప్రతినిధులు కేంద్రంపై వత్తిడి తేవాలి



ఏపీ సంపర్క్‌క్రాంతి (ఢిల్లీ) రైలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్‌: తిరుపతి నుంచి దేశ రాజధానికి నడిచే ఢిల్లీ రైలు నంబర్‌ (12708–12707) డైలీ పట్టాలపై ఎప్పుడు పరుగులు తీస్తుందా? అని రాయలసీమతో పాటు ఉత్తర తెలంగాణవాసులు ఆశతో ఎదురుచూస్తున్నారు. గత 17 ఏళ్లుగా ఢిల్లీ రైలు వారానికి మూడురోజులు మాత్రమే రాకపోకలు సాగిస్తోంది. రాష్ట్ర రాజధానుల నుంచి ఆయా రాష్ట్రాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాల నుంచి దేశ రాజధాని ఢిల్లీకి వేగవంతమైన ప్రయాణానికి నేరుగా అనుసంధానం చేయడానికి కేంద్రంలో అప్పటి యూపీఏ ప్రభుత్వ హయాంలో నాటి రైల్వే మంత్రి లాలుప్రసాద్‌యాదవ్‌ సంపర్క్‌ క్రాంతి రైళ్లను తెరపైకి తెచ్చారు. 2005 మార్చి రైల్వే బడ్జెట్‌లో ప్రకటించారు. అదే సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని సికింద్రాబాద్‌ జోనల్‌ ప్రధాన కార్యాలయం, సికింద్రాబాద్‌ జంక్షన్‌ నుంచి ఢిల్లీ నిజాముద్దీన్‌కు ఏపీ సంపర్క్‌ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌ రైలును జూలై 2005లో పట్టాలెక్కించారు.

గతంలో వ్యయప్రయాసలతో ప్రయాణం

సీమ ప్రాంత ప్రజలకు ముఖ్యంగా ఉమ్మడి కడప జిల్లా వాసులకు దేశరాజధాని ఢిల్లీకి వెళ్లడానికి కనీసం ఒక్క రైలులేదు. తిరుపతి నుంచి యాత్రికులు ఢిల్లీ, ఉత్తరాది నగరాలకు వెళ్లాలంటే రైలులో రేణిగుంటకు వచ్చి, అక్కడి నుంచి కేరళ ఎక్స్‌ప్రెస్‌ ద్వారా నెల్లూరు, గూడూరు మీదుగా వ్యయప్రయాసలతో ఢిల్లీకి ప్రయాణం చేసేవారు.

కష్టసాధ్యంగా రిజర్వేషన్‌

తిరుపతి, రేణిగుంట నుంచి కేరళ, హిమసాగర్‌, నవయుగ, స్వర్ణజయంతి నడుస్తున్నాయి. ఇవన్నీ తిరువనంతపురం, ఎర్నాకులం, కన్యాకుమారి నుంచి వస్తున్నాయి. వీటిలో రిజర్వేషన్‌ లభించడం గగనమే. మూడునెలల ముందు కూడా దొరకని పరిస్థితి. ఇవన్నీ గూడూరు, విజయవాడ, వరంగల్‌, పెద్దపల్లి మీదుగా వెళ్తాయి.

సీమ వాసుల ఆకాంక్ష

ఇలాంటి పరిస్థితిలో ఏపీ సంపర్క్‌ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌రైలు డైలీ నడిపిస్తే ఉపయోగకరంగా ఉంటుందని రాయలసీమ వాసులు కోరుకుంటున్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు కూడ ఈ దిశగా కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖపై ఒత్తిడి తీసుకొచ్చి సీమ వాసుల ఆకాంక్షను ఏ మేరకు నెరవేరుస్తారనేది వేచిచూడాల్సి ఉంది.

రోజూ నడపాలనే డిమాండ్‌..

ఏపీ సంపర్క్‌ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌ రైలు డైలీ నడపాలనే డిమాండ్‌ చాల రోజులుగా ఉంది. రాయలసీమ ప్రాంత ప్రజలకు,ఉత్తర తెలంగాణా నగరాలకు, హైదరాబాదుకు వెళ్లడానికి పగటిపూట ప్రయాణంతో సాయంకాలానికి సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. తిరుపతి నుంచి డైలీ నడిస్తే అన్నమయ్య, కడప, కర్నూలు జిల్లాల నుంచి తెలంగాణాలో ఖాజీపేట, పెద్దపల్లె, మంచిర్యాల, సిర్పూర్‌ మీదుగా కాగజ్‌నగర్‌ వెళ్లడానికి దోహదపడుతుంది.


మహానేత వైఎస్సార్‌ చొరవతో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ అప్పటి ముఖ్యమంత్రి దివంగత మహానేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి ఏపీ సంపర్క్‌ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌ రైలును తిరుపతి నుంచి రాయలసీమ ప్రాంతాల నుంచి సికింద్రాబాదు వరకు నడపాలని అప్పటి రైల్వే శాఖను కోరారు. 2007లో ఈ రైలు తిరుపతి నుంచి సికింద్రాబాద్‌ టు ఢిల్లీకి నడిచింది. ఈ రైలును తిరుపతి నుంచి రేణిగుంట, రాజంపేట, నందలూరు, కడప ,గుత్తి, డోన్‌, కర్నూలు, మహబూబ్‌నగర్‌ మీదుగా పొడిగించారు. మహానేత వైఎస్సార్‌ ప్రత్యేక చొరవతో తిరుపతి, అన్నమయ్య, కడప, కర్నూలు జిల్లాల నుంచి తెలంగాణ మీదుగా దేశ రాజధానికి వెళ్లేందుకు రైలు అందుబాటులోవచ్చింది.

నోటీస్‌ బోర్డు

- జిల్లాలోని 8 కేంద్రాలలో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా డీఎస్సీ పరీక్షలు.
- ఎంఆర్‌ పల్లిలోని పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్‌లో ఉదయం 9.45 గంటలకు 200 ఆటో డిజిటలైజేషన్‌ క్యూఆర్‌ కోడ్‌ నంబర్ల ఆవిష్కరణ కార్యక్రమం.
- తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక. ఫిర్యాదులు చేసేవారు 0877–2227208 నెంబర్‌కు ఫోన్‌ చేసి తెలియజేయవచ్చు. 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్‌ యువర్‌ కమిషనర్‌.
- ఉదయం 10 గంటలకు టీటీడీ పరిపాలన భవనం వద్ద కాంగ్రెస్‌ పార్టీ నిరసన కార్యక్రమం.
- పుదిపట్ల రామకృష్ణ మందిరంలో సాయంత్రం 6.30 గంటలకు శ్రీమద్భాగవత సప్తాహం.
- టీటీడీ పాఠశాలల్లోని 7,8,9 తరగతుల విద్యార్థులకు నాలుగు రోజుల పాటు తలపెట్టిన సద్గమయ శిక్షణా కార్యక్రమం ప్రారంభం.

బంగారు తిరుచ్చిపై దేవదేవుడు



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆదివారం సాయంత్రం ఉయ్యాల సేవ అనంతరం బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

శ్రీశ్రీకి ఘన నివాళి



శ్రీశ్రీ చిత్రపటం ముందు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

తిరుపతి కల్చరల్‌: తన రచనలతో తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడమే కాకుండా, సమాజాన్ని జాగృతం చేసిన మహోన్నత కవి శ్రీశ్రీ అని వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున కీర్తించారు. శ్రీశ్రీ వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ, శ్రీశ్రీ రచనలు సమాజంలోని అసమానతలను, అన్యాయాలను ఎదుర్కొనేందుకు, ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు ఒక శక్తివంతమైన సాధనంగా నిలిచాయన్నారు. గౌరవ సలహాదారుడు టెంకాయల దామోదరం మాట్లాడుతూ శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం ఒక కొత్త ఒరవడిని సృష్టించిందన్నారు. ఆయన రచనలు కేవలం సాహిత్యంగానే కాక సినిమా గేయ రచనలోనూ ఆయన ప్రతిభను చాటారన్నారు. శ్రీశ్రీ సాహితీ సంపదను కొనసాగించేందుకు, ఆయన ఆలోచనలను, సందేశాలు యువతకు అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు ముఖేష్‌, జయశంకర్‌, శివకుమార్‌ ,పద్మ, ప్రభాకర్‌, ఇమామ్‌, వినయలత, ప్రమోద్‌, ప్రసూన, విద్యార్థులు పాల్గొన్నారు.

నీట్‌లో 'శ్రీధర్స్‌ అకాడమీ' ప్రతిభ


చైతన్యరెడ్డి


ఐశ్వర్య


తమోహిష్‌

తిరుపతి ఎడ్యుకేషన్‌ : నీట్‌ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని శ్రీధర్స్‌ అకాడమీ విద్యార్థులు మంచి మార్కులు సాధించి ప్రతిభ చాటారు. ఈ ఫలితాల్లో జె.చైతన్యరెడ్డి 578మార్కులు, టి.ఐశ్వర్య 550, వి.మోహిష్‌ 540, కె.దుర్గ 535, జి.చరన్‌సాయి 530, పి.వైష్ణవి 520, కె.సాయిపార్ధు 510, హాసిని 502మార్కులు, తమ విద్యార్థులు 10మంది 500కుపైగా మార్కులు సాధించినట్లు ఆ విద్యాసంస్థ చైర్మన్‌ మద్దినేని శ్రీధర్‌ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

104 ఉద్యోగుల నూతన కార్యవర్గం



104 ఉద్యోగుల నూతన జిల్లా కమిటీ నాయకులు, సభ్యులు

తిరుపతి తుడా: స్థానిక సీపీఎం కార్యాలయ వేమన విజ్ఞాన కేంద్రంలో తిరుపతి జిల్లా 104 ఉద్యోగుల సంఘం ఆదివారం సమావేశమై జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్‌ గవర్నమెంట్‌ కాంట్రాక్ట్‌, ఔట్‌ సోర్సింగ్‌, ఎంప్లాయీస్‌ అండ్‌ వర్కర్స్‌ యూనియన్‌ తిరుపతి జిల్లా జేఏసీ చైర్మన్‌ గండికోట నాగవెంకటేష్‌ మాట్లాడుతూ, రాష్ట్రంలో 104 సర్వీసులను గతంలో అరబిందో యాజమాన్యం నిర్వహించిదని, రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. 104 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అమరనాథ్‌ మాట్లాడుతూ, ప్రస్తుతం 104 సర్వీసులు నిర్వహిస్తున్న 'భవ్య హెల్త్‌ సర్వీస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌' యాజమాన్యం కూడా ఉద్యోగులకు ప్రతి నెలా వేతనాలు చెల్లించాలన్నారు. తిరుపతి జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలు చేసి మిగతా స్థానాల్లో కొత్త నియామకాలు జరపాలని కోరారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా అమర్నాథ్‌, కార్యదర్శిగా రుద్ర, ఉపాధ్యక్షులుగా యశ్వంత్‌, కోశాధికారిగా భువనేశ్వరి, సభ్యులను ఎన్నుకున్నారు.

వామ్మో.. అవినీతి అనకొండ మళ్లీ వచ్చేస్తోంది..!

- వివాదాస్పద ఇళ్లు, విలువైన ఆస్తులే ఆయన టార్గెట్‌!
- పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన చోటే కీలక పదవి
- ఇక, మళ్లీ చేయి తడపనిదే ఫైళ్లు కదలవంటున్న నేతలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్‌: ఆయన ఒకప్పుడు పంచాయతీ కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేశారు.. ఎన్ని ఆరోపణలు వచ్చినా సరే అధికార పార్టీ నేతల అండతో అక్కడ నుంచి కదలలేదు.. అనుకున్న చోటుకు పోస్టింగ్‌ తెచ్చుకోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య.. ఏ పనిలో అయినా వాటా ఇవ్వాల్సిందే! గ్రామ పంచాయతీల్లోని వివాదాస్పద ఇళ్ల స్థలాలు, విలువైన భూములు ఆయన టార్గెట్‌. కోర్టు కేసులున్నా సరే.. ఎవరు ఎక్కువగా చేయి తడిపితే వారికే అనుకూలంగా వ్యవహరించి, ఇంటి పన్నులు మార్చేసి, గుట్టుగా దోచేసుకోవడం ఆయన నైజం. అవినీతి అక్రమాలకు పాల్పడి కోట్లు కూడబెట్టిన ఆ ఘనుడికి సాక్షాత్తు ఆరోపణలు వెల్లువెత్తిన చోటుకే జిల్లా అధికారులు మళ్లీ పోస్టింగ్‌ ఇవ్వడం చర్చనీయాంశమైంది.

తిరుపతి రూరల్‌ మండలం ఉమ్మడి శెట్టిపల్లె, తిరుచానూరు మేజర్‌ పంచాయతీలకు కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తి 2014 నుంచి 2019 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలతో అంటకాగుతూ చక్రం తిప్పారు. ఆయనపై అవినీతి ఆరోపణలు కోకొల్లలు.. అయినప్పటికీ సుదీర్ఘ కాలం ఒకే మండలంలో పనిచేయడం వెనుక నేతల అండదండలే ప్రధాన కారణం. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో మరో మండలానికి బదిలీపై వెళ్లిన ఆయన కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వారం క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో గుట్టుగా రూరల్‌ మండలానికి డిప్యూటీ ఎంపీడీఓగా పోస్టింగ్‌ పొందారు. అవినీతి ట్రాక్‌ రికార్డు కలిగిన ఆ ఆయనకు కీలక స్థానంలో పోస్టింగ్‌ ఇవ్వడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

మళ్లీ అవినీతికే పెద్దపీట

ఎక్కడ పనిచేసినా అవినీతి, అక్రమాల్లో పేరు మోసిన ఆయనకు ఇక మళ్లీ చేయి తడనిదే ఏ ఫైలూ కదలదని రాజకీయ పార్టీల నేతలు అంటున్నారు. పల్లెల్లో వివాదాస్పద ఇళ్లు, ఇతర ఆస్తులను ఓ చూపు చూస్తారని..ఆ అవినీతి అనకొండ ఆకలికి అంతు ఉండదని, ఇక మండల పరిషత్‌ కార్యాలయానికి ఏ మకిలి అంటిస్తారోననే చర్చ జనంలో మొదలైంది.

చేపల చెరువుల నుంచి.. ఇంటి పన్నుల వరకు..!

గతంలో ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఆ ఉద్యోగి చేపల చెరువులకు వేలం లేకుండా చేసి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టారు. పంచాయతీల్లో చేపల చెరువుల వేలం ప్రక్రియకు మంగళం పాడి అందులో భారీ అవినీతికి పాల్పడ్డారన్న విమర్శలు అప్పట్లో పెద్ద దుమారం రేపాయి. దీనిపై అప్పట్లో జిల్లా స్థాయి అధికారులు విచారణకు కూడా ఆదేశించినట్టు సమాచారం. ఇకపోతే తిరుపతి నగరం శెట్టిపల్లె పరిసరాలకు అప్పుడప్పుడే విస్తరిస్తుండడంతో భూముల విలువ విపరీతంగా పెరిగింది. దీనిని అవకాశంగా చేసుకున్న ఆయన వివాదాస్పద భూములు, ఇళ్ల స్థలాలకు పంచాయతీ పన్నులు విధించి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు వచ్చాయి. కోర్టుల్లో కేసులు నడుస్తున్నా సరే ఎవరు పెద్ద మొత్తంలో చేయి తడిపితే వారికి అనుకూలంగా పన్నుల విధింపులో వ్యవహరించేవారని విమర్శలున్నాయి. తెలుగు తమ్ముళ్ల అండదండలతో సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆ తరువాత అమ్మవారి సన్నిధి (తిరుచానూరు)లో కూడా పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పేదల నడ్డి విరిచే పనులు, అమ్మవారి సన్నిధిలోనూ అక్రమాలకు తెరలేపే వివాదాస్పద పనులు ఎన్నో చేపట్టి విమర్శలపాలయ్యారు. ఇలా వివాదాస్పదునిగా ముద్ర పడిన ఆ కార్యదర్శి గత వైఎస్సార్‌ సీపీ ఐదేళ్ల పాలనలో కుక్కినపేనులా పనిచేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎక్కడైతే వివాదాస్పదుడిగా ముద్రపడ్డారో అదే మండలానికి ఆయన అధికారిగా రావడం వెనుక టీడీపీ నేతల ప్రమేయం ఉందనే ప్రచారంలోకి వచ్చింది.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

పాకాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీటీఏ నాయకులు డిమాండ్‌ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీటీఏ మండల అధ్యక్షుడు జ్యోతిప్రసాద్‌ అధ్యక్షతన ఉమ్మడి చిత్తూరు కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీటీఏ జిల్లా అధ్యక్షుడు కె.రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి బి.రామమూర్తి సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. సకాలంలో పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న డీఏ అరియర్స్‌, పీఆర్సీ అరియర్స్‌, పీఎఫ్‌, సరెండర్‌ బకాయిలను చెల్లిస్తామని చెప్పి చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సీ ఆలస్యమైతే ఐఆర్‌ను వెంటనే ప్రకటిస్తామని హామీ ఇచ్చిన ఏడాది కావస్తున్నా ఇప్పటి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఏ ఒక్క హామీ అమలు చేయకుండా కాలయాపన చేయడం బాధాకరమన్నారు. వెంటనే 12వ పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్‌ 30 శాతం, ప్రకటించాలని కోరారు. బీటీఏ జాతీయ ఉపాధ్యక్షుడు జి.ఆంజనేయులు మాట్లాడుతూ పెన్షనర్లకు 2018 నుంచి రావాల్సిన డీఏ బకాలు, 11వ పీఆర్సీ అరియర్స్‌ బకాయిలు త్వరగా చెల్లించాలని, లేకుంటే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతో ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీటీఏ నాయకులు ఎన్‌.ఆదికేశవులు, జయబాల, కేఎస్‌.తులసీరామన్‌, కృష్ణమూర్తి, విజయ మోహన్‌రెడ్డెప్ప, వెంకటయ్య, శివ, రమణ, గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో యోగా శిక్షణ



శిల్పారామంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు

చంద్రగిరి: 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుచానూరు శిల్పారామంలో ఆదివారం ఉచిత యోగా శిక్షణ తరగతులను ఏఓ సుధాకర్‌ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 21వ తేదీ వరకు ప్రత్యేక ఉచిత యోగా శిక్షణ యోగా గురువులు చలపతి, నవీన్‌ నేతృత్వంలో ఇస్తామన్నారు. శ్వాస నియంత్రణ, ధ్యానం, శరీర సాధన తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఈ తరగతులు నిర్వహిస్తామని, నగరవాసులు పాల్గొని, యోగాను తమ నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని కోరారు.

స్వర నీరాజనం



పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

తిరుపతి కల్చరల్‌: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతిని పురస్కరించుకొని మహతి కళాక్షేత్రంలో గాయనీ గాయకులు తమ స్వర గానంతో ఆయనకు నీరాజనాలు అర్పించారు. తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా 'అంకితం నీకు అంకితం' పేరుతో పాటల సంగీత విభావరి చేపట్టారు. చివరి రోజైన ఆదివారం జరిగిన కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి ఇంద్రజ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పాటల సంగీత విభావరిని ప్రారంభించారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు ప్రవస్తి, స్నిగ్ధ, శృతిశ్రావణి, సురభి శ్రావణి, రేణుకుమార్‌, నరసింహ, ఉదయ భాస్కర్‌ నాడు బాలు స్వరం నుంచి జాలువారిన అద్భుతమైన పాటలను గానం చేసిన ప్రేక్షకుల హృదయాలను ఓలలాడించారు. అనంతరం ముఖ్యఅతిథి ఇంద్రజను తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్‌ ఎం.వేణుగోపాల్‌ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మరో అతిథి ఎమ్మెల్సీ డాక్టర్‌ సిపాయి సుబ్రమణ్యం, సినీ నిర్మాత ఎలమంచిలి ప్రవీణ్‌ మాట్లాడారు. తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు బాబు, ఉపాధ్యక్షులు, ఎస్‌.సుబ్రమణ్యం, బుజ్జిబాబు, కోశాధికారి ప్రసాద్‌రావు, మధుసూదన్‌రెడ్డి, గుల్జర్‌ పాల్గొన్నారు.

నృత్యం.. మంత్రముగ్ధం

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం చెన్నైకు చెందిన శ్రీహర్ష నాట్య కేంద్రం ఆధ్వర్యంలో నాట్యాచార్యులు గిరిధరణ, శ్రీహర్షల పర్యవేక్షణలో భరత నాట్యం ప్రదర్శించారు. వివిధ పాటలకు కళాకారులు హస్విక శ్రీధరన్‌, హరిణి, నిత్య, మిత్ర, నిర్మిత కృష్ణ, శ్రేయన్య, అనగమీనన్‌, హంసవర్ధిని, శుభశ్రీ, ఆప్తి, గౌతమి, అర్పిత, నీలారుణ, శాన్వి, స్వర్శిని, డెబాంజలి, సంతోష్‌ చూడచక్కని హావభావాలతో నాట్యం ప్రదర్శించారు. ఏఓ సుధాకర్‌ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.





నృత్యప్రదర్శనలతో ఆకట్టుకుంటున్న కళాకారులు

మా గోడు కనవేమి స్వామీ..?

- వెంకన్నకు ఎప్పటిలాగే ని'వేదన'
- ఫాదర్స్‌ డే స్పెషల్‌ : తండ్రులకు మద్దతుగా పిల్లలూ దీక్ష
- 300 రోజులకు చేరిన శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల దీక్షలు



శ్రీవారిమెట్టు చిరువ్యాపారుల నిరాహార దీక్షలో తమ తల్లిదండ్రులతోపాటు పిల్లలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్‌: 10 నెలల బాలుడి నుంచి 75 ఏళ్ల ముదుసలి వరకు కుటుంబ సభ్యులతో సహా శ్రీవారిమెట్టు చిరు వ్యాపారులు దీక్ష చేశారు. స్థానిక కపిల తీర్థం రోడ్డులోని టీటీడీ పరిపాలనా భవనం వద్ద శ్రీవారిమెట్టు చిరువ్యాపారులు చేస్తున్న నిరసన దీక్ష ఆదివారం 300వ రోజుకు చేరుకుంది. ఆదివారం పూర్తిగా నిరాహార దీక్ష నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, కార్యదర్శులు ఎస్‌.జయ చంద్ర, పి.మునిరాజలతోపాటు వ్యాపారులు, వారి కుటుంబ సభ్యులు సంఘీభావం ప్రకటించారు. ఈ పర్యాయం దీక్షలో మహిళలు వారి పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం..ఫాదర్స్‌ డే రోజున తండ్రుల పోరాటానికి మద్దతుగా పసిపిల్లలు డిమాండ్ల ప్లకార్డులను పట్టుకుని నినాదాలు చేయడం ఆ మార్గంలో పలువురి దృష్టిని ఆకర్షించింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సంఘం గౌరవాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ, చిన్న సమస్య పరిష్కారానికి వ్యాపారులు 300 రోజులుగా దీక్షలు చేస్తున్నా టీటీడీ యాజమాన్యం గానీ, కూటమి ప్రభుత్వం గానీ పరిష్కరించకపోవడం శోచనీయమని నిరసించారు. టీటీడీ ఇఓ శ్యామలరావు, అడిషనల్‌ ఇఓ వెంకయ్య చౌదరి పలు పర్యాయాలు బాధితుల గోడు ఆలకించిననూ వారికి న్యాయం చేయలేదని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, రిపబ్లికన్‌ పార్టీ దక్షిణ భారత అధ్యక్షులు పూతలపట్టు అంజయ్య, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు మాంగాటి గోపాల్‌ రెడ్డి, సీపీఐ నేత ఎన్‌డీ రవి, ఆమ్‌ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు నీరుగట్టు నగేష్‌, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ నేత డీఎంసీ భాస్కర్‌, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి పి. సాయిలక్ష్మి, ఆప్కాస్‌ రాష్ట్ర అధ్యక్షులు చినబాబు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్‌ నాగ వెంకటేష్‌ తదితరులు బాధితులకు సంఘీభావంగా మాట్లాడారు. సంఘ అధ్యక్షులు చిట్టిబాబు, యూనియన్‌ కార్యదర్శి మధు, యుగంధర్‌, ప్రకాష్‌ రామ్మూర్తి, శేఖర్‌, నరసింహ, మల్లి, మల్లికార్జున్‌, రాంబాబు, చిరంజీవి, శివ, గణేష్‌, రాజశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.